
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 31 మార్చి 2024



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో మూలనపడ్డ అంబులెన్స్‌లు 8లో..
కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు ఇవ్వాలి

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 ఆదివారం
సహర్ 4:41 సోమవారం





రసవత్తరంగా రాజకీయాలు

- రైతులకు అండగా బీఆర్ఎస్ నిరసన దీక్ష
- ప్రచారంలో ముందుకు వెళుతున్న బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థి టికెట్‌పై పార్టీలో దుమారం
- పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో మారుతున్న సమీకరణాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తుండడంతో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. బీఆర్ఎస్ పార్టీ ఎండుతున్న పంటలతో అల్లాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు 36 గంటల పాటు రైతు నిరసన దీక్ష చేపట్టగా, బీజేపీ అభ్యర్థి ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపికపై ఢిల్లీలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఆందోళన చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనెల 18వ తేదీన వెలువడ నుండడంతో ఆయా పార్టీలు అప్రమత్తమయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా గోమాసే శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకు టికెట్ ఇవ్వడాన్ని ఆ పార్టీకి చెందిన నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాకుండా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆయా సంఘాలు ఢిల్లీలో కూడా ఏఐసీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో వంశీకృష్ణ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆయా నియోజకవర్గాల్లోని మండలాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికల కోసం సన్నద్ధం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన గోమాసే శ్రీనివాస్ తనకు టికెట్ రాదని భావించి బీజేపీ పార్టీలో చేరారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అండదండలతో ఆయన పెద్దపల్లి టికెట్ సాధించారు. వారం రోజుల నుంచి శ్రీనివాస్ పార్ల మెంటు పరిధి లోని అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలను కలుస్తూ తనను గెలిపించాలని కోరుతున్నారు. అలాగే వివిధ సంఘాల నాయకులను సైతం కలుస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

• మాదిగలకు కేటాయించాలని డిమాండ్..

ఈ యాసంగి సీజన్లో రైతులు సాగుచేసిన వరి పంటకు సరిపడా సాగునీరు అందకపోవడంతో కాలువ చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండుతున్నాయి. దీని ఆసరాగా చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తూ 36 గంటల పాటు నిరసన దీక్ష చేపట్టారు. జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం 8 గంటలకు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు పార్టీ కార్యకర్తలతో పాటు రైతులను చేరదీశారు. ఈ దీక్ష ఆదివారం రాత్రి 8 గంటల వరకు జరగనున్నది. ఒకవైపు బీఆర్ఎస్ పార్టీ నాయకులు దీక్షల పేరిట ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తుండగా, బీజేపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థి విషయంలో ఆందోళనలు పెద్దపల్లి నుంచి ఢిల్లీ వరకు చేరాయి. దీంతో ఆ పార్టీ అభ్యర్థి ప్రచారం విషయంలో వెనుకబడ్డారు. రాష్ట్రంలో ఉన్న 17నియోజకవర్గాల్లో మూడు నియోజకవర్గాలను ఎస్సీలకు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రెండు నియోజకవర్గాలను మాదిగ సామాజిక వర్గాలకు కేటాయించాలని డిమాండ్ వస్తున్న విషయం తెలిసిందే. అయితే పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మాల సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి టికెట్ ఇవ్వగా, బీజేపీ నేతకాని సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ మాత్రం మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు టికెట్ ఇస్తుందని ఆశించారు. కానీ ఆ పార్టీ కూడా మాదిగ వర్గాన్ని విస్మరించి మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ గడ్డం వివేక్ తనయుడు వంశీకృష్ణకు టికెట్ ఇచ్చింది. దీంతో పెద్దపల్లిలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి రాజకీయ సమీకరణాలు మరింత రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు ప్రోత్సాహకం

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



విద్యార్థులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి కల్చరల్, మార్చి 30: క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన బాలికలను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందించామని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శనివారం అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా క్రీడల్లో ఆసక్తి చూపుతూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బహుమతి కింద నగదు పంపిణీ చేయాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయించామన్నారు. జిల్లాలో ఉన్న 14 మండలాల వారీగా డీఈవో నేతృత్వంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన 14మంది బాలికలను ఎంపికచేసి ఒక్కొక్కరికి 3వేల 300రూపాయలు చొప్పున చెక్కులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఏ.సురేష్, పీఈటీ ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 30 : పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో డీఈవో, ఇతర అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం నిర్వహించిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షలో 7728 మంది విద్యార్థులకు 7716 మంది విద్యార్థులు హాజరుకాగా, 99.8శాతం హాజరు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 15 పరీక్షా కేంద్రాలు, అసిస్టెంట్ కమీషనర్ పరీక్షల విభాగం మూడు పరీక్షా కేంద్రాలను, డీఈవో మూడు పరీక్షా కేంద్రాలను సందర్శించారని, మాల్‌ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, సాంఘిక శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు, పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డీఈవో మాధవి తెలిపారు.

నేటితో ముగియనున్న ఆస్తి పన్ను వడ్డీ రాయితీ

- రామగుండంలో కార్పొరేషన్‌లో రూ.99.5లక్షల వసూళ్లు - విలీన, శివారు గ్రామాల్లోనే భారీ బకాయిలు

కోల్‌సిటీ, మార్చి 30: మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ పథకం ఆదివారంతో ముగియనున్నది. మార్చి 31వ తేది వరకు ఆస్తి పన్ను (ఇంటి పన్ను) బకాయిలు చెల్లించిన వారికి బకాయిలపై వడ్డీలో 90శాతం మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థతో పాట పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో పాత బకాయిదారులకు మంచి అవకాశం లభించినట్లు అయ్యింది. నాలుగైదు సంవత్సరాలు పేరుకుపోయిన పన్నులు వసూలవుతున్నాయి. సాధారణంగా ఆస్తి పన్ను బకాయిల్లో అసలు పన్ను కన్నా వడ్డీనే రెండు మూడు రెట్లు ఉంటుంది. దీంతో బకాయి పేరుకుపోయి ఇంటి యజమానులు పన్నులు కట్టాలంటే జంకేవారు. మూడేళ్లలో రాయితీ ప్రకటించలేదు. ఈసారి ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. రామగుండం నగరపాలక సంస్థలోనే 1790మంది ఈ రాయితీని వినియోగించుకున్నారు. రూ.99.5 లక్షలు వసూలయ్యాయి. ప్రభుత్వరంగ సంస్థలైన జెన్‌కో రూ.93లక్షలు చెల్లించి రూ.28లక్షల రాయితీ పొందగా, బీఎస్ఎన్ఎల్ రూ.24లక్షలు చెల్లించి రూ.35లక్షల రాయితీ పొందింది. ఒక మార్చి మాసంలోనే రూ.2.05కోట్ల వరకు పన్నులు వసూలయ్యాయి. ఇందులో సుమారు 75 శాతం వసూళ్లు ఈ పథకాన్ని వినియోగించుకున్నవే.



రామగుండం కార్పొరేషన్‌లోని ఇళ్లు

అందిపుచ్చుకుంటున్న ప్రభుత్వరంగ సంస్థలు..

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపల్ శాఖ ఆస్తి పన్నుపై ప్రకటిస్తున్న రాయితీలను అందిపుచ్చుకుంటున్నాయి. ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థలు ఈ ఏడాది ఎర్లీ బర్డ్ ఆఫర్‌లో 5శాతం మినహాయింపును వాడుకున్నాయి. ఎన్‌టీపీసీ రూ.2.03కోట్లు, ఆర్ఎఫ్‌సీఎల్ రూ.1.25కోట్లు, సింగరేణి రూ.1.17కోట్లు ముందస్తుగా పన్నులు చెల్లించి 5శాతం రాయితీ పొందాయి. సింగరేణి సంస్థ ఆర్‌జీ-1 విభాగం అయితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూడా ఈ పథకం వర్తిస్తుందని ముందస్తుగా రూ.73లక్షల చెక్కును నగరపాలక సంస్థకు పంపింది. రామగుండంలోని జెన్‌కో విద్యుత్ కేంద్రం నాలుగేళ్లుగా ఆస్తి పన్ను బకాయిలు పడింది. వడ్డీమాఫీ పథకంతో రూ.28లక్షల రాయితీ పొందింది. రూ.93 లక్షలు చెల్లించారు. అదే విధంగా బీఎస్ఎన్ఎల్ సంస్థ రూ.60లక్షల బకాయిలు ఉండగా ఈ పథకంలో రూ.24.6లక్షలు చెల్లించి రూ.35 లక్షలు మాఫీ పొందింది. ఆర్‌టీసీ సైతం రూ.3.26లక్షలు చెల్లించింది. పోలీస్ శాఖ రూ.1.94లక్షలు చెల్లించాల్సి ఉంది. శనివారం ఒక్కరోజే ఈ పథకంలో రూ.40లక్షలు వసూలయ్యాయి.

శివారు గ్రామాల్లో పేరుకుపోయిన బకాయిలు..

జిల్లాలోని మున్సిపాలిటీలు, రామగుండం నగరపాలక సంస్థలో శివారు గ్రామాలు, విలీన గ్రామాల్లోనే ఆస్తి పన్ను బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. రామగుండం నగర పాలక సంస్థలో పాత రామగుండం, బ్రదిపల్లి, మల్యాలపల్లి, మేడిపల్లి, మల్కాపూర్, జంగాలపల్లి, వీర్లపల్లి, లక్ష్మీపురం, అల్లూరు, మారేడుపాక, జనగామ గ్రామాలు ఉన్నాయి. ఇవి పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామాలు. ఈ గ్రామాల్లో పాత ఇండ్లు వైశాల్యం ఎక్కువగా ఉండడం వల్ల పన్నులు కూడా ఎక్కువగా వస్తున్నాయి. మంథని, సుల్తానాబాద్ గ్రామ పంచాయతీలను శివారు గ్రామాలను విలీనం చేసి మున్సిపాలిటీలుగా మార్చారు. పెద్దపల్లిలో సైతం పలు గ్రామాలను విలీనం చేశారు. ఈ గ్రామాల్లో పన్ను బకాయిలు ఎక్కువగా పేరుకుపోయాయి. అసలు కంటే వడ్డీ ఎక్కువగా ఉండడంతో కట్టేందుకు ఇంటి యజమానులు వెనుకంజ వేశారు. ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించడంతో బకాయిదారులు చెల్లింపులు చేస్తున్నారు.

రామగుండంలో రూ.7.7కోట్ల వసూళ్లు..

రామగుండం నగరపాలక సంస్థలో ప్రైవేట్ నివాసాలపై 11.75కోట్ల డిమాండ్ ఉండగా శుక్రవారం నాటికి రూ.7.7కోట్లు వసూలయ్యాయి. ప్రభుత్వరంగ సంస్థలు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిపాయి. ప్రైవేట్ నివాసాలు 50వేల వరకు ఉన్నాయి.

పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లకిడి భాస్కర్



లకిడి భాస్కర్

పెద్దపల్లిటౌన్, మార్చి 30:బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లకిడి భాస్కర్ ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి నంద మొగిళి ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా అలాడి ఫణి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా తోడెంగుల అశోక్, కోశాధికారిగా కోట సురేందర్, లైబ్రరీ కార్యదర్శిగా సంతోష్ బాబ్జీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా బర్ల రమేష్‌మహిళా ప్రతినిధిగా రమాదేవి, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆసరి రమేష్, వడ్ల కొండ రమేష్, పుట్ట రవిని నియమించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

ఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తౌటం సతీష్



తౌటం సతీష్

కోల్‌సిటీ, మార్చి 30: గోదావరిఖని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు శనివారం జరిగాయి. అధ్యక్షునిగా తౌటం సతీష్, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాంటెంకి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా పులిపాక ప్రవీణ్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా దూడపాక లింగస్వామి, లైబ్రరీ సెక్రెటరీగా ఇరుగురాళ్ల మహేందర్ ఎన్నికకాగా, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా గుర్రం నారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లుగా భానుకృష్ణ, చిదురాల రమేష్, ఎం వరలక్ష్మి ఎన్నికయ్యారు.

పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

కోల్‌సిటీ, మార్చి 30: జిల్లాలో పదవీవిరమణ పొందిన పోలీస్ సిబ్బందికి శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఘనంగా వీడ్కోలు పలికారు. పీసీఆర్ ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, రామగుండం పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ సత్తయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పీ అంజయ్య, బసంత్ నగర్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ అజీజ్‌బేగ్‌లను సీపీ సన్మానించారు. రిటైర్‌మెంట్ కేవలం వృత్తికేనని, వ్యక్తిత్వానికి కాదని సీపీ పేర్కొన్నారు. పదవీవిరమణ పొందిన తరువాత కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ సీ రాజు, ఏవో సతీష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట్ల పోచలింగం, స్వామి పాల్గొన్నారు.

ఏప్రిల్ 15వరకు ఓటుహక్కు నమోదుకు అవకాశం

ఎలిగేడు, మార్చి 30: ఏప్రిల్ 1నాటికి 18ఏళ్లు నిండిన యువతీయువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. తమ అమూల్యమైన ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఏప్రిల్ 15 చివరి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోర్టుల్లో నేరస్థులకు శిక్షలు పడేలా చూడాలి

- పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో త్వరితగతిన చార్జిషీట్ వేయాలి
- సమీక్ష సమావేశంలో రామగుండం సీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 30 : పోలీసులు నమోదు చేసిన కేసుల్లో నేరస్థులకు కోర్టుల్లో శిక్షలు పడేలా సమగ్ర సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టాలని, శిక్షల రేటును పెంచాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60రోజుల్లో విచారణ పూర్తి చేసి చార్జిషీట్లు వేయాలన్నారు. ప్రతి కేసులో సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయాలని, పారదర్శకతతో విచారణ చేయాలన్నారు. తద్వారా చట్ట పరిధిలో నేరస్థులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని, అప్పుడే పోలీసులపై, పోలీస్‌శాఖపై నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రతి సీడీ ఫైల్‌లో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రాబోయే ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి అధికారులు, సిబ్బంది సమిష్టిగా పని చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలు పాటిస్తూ నిస్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల జిల్లా ఏసీపీలు ఆర్ ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర పాల్గొన్నారు.

యువకుడిపై గొడ్డలితో దాడి

ధర్మారం, మార్చి 30 : ధర్మారం మండలంలోని నందిమేడారం గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న మనవడిపై అర్ధరాత్రి తాత గొడ్డలితో దాడి చేశాడు. ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఎస్సై సత్యానారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నందిమేడారం గ్రామానికి చెందిన సామంతుల మహేష్(28) అనే యువకుడికి సామంతుల కోమురయ్య(61) తాత అవుతాడు. కొంత కాలంగా వీరి కుటుంబంలో కలహాలు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో శనివారం ఇంట్లో నిద్రిస్తున్న మహేష్‌పై తాత కొమురయ్య గొడ్డలితో హత్యాయత్నం చేశాడు. ఈ దాడిలో మహేష్ ముఖంపై గాయాలు అయ్యాయి. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బాధితుడి మేనమామ కట్ట కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టింపే లేదు

- పంట నష్టపోయిన రైతులకు 25వేల రూపాయల పరిహారం చెల్లించాలి
- రైతు నిరసన దీక్షలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిటౌన్, మార్చి 30: పంటలు ఎండుతున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపే లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లిలో శనివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన 36 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో పాల్గొన్న పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సాగునీరందక రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల పంటలు ఎండి పోయాయని అన్నారు. పంటలు ఎండుతున్నా కూడా సరిపడా సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టు నీరందక మంథని, ముత్తారం, కమాన్‌పూర్, ధర్మారం, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు మండలాల్లో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ కూడా రాష్ట్రంలో పంటలు ఎండిపోలేదని అన్నారు. సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించి సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో రైతులు రెండు సీజన్లలో బ్రహ్మాండంగా పంటలు పండించారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి రెండు పంటలకు పెట్టుబడి సాయం అందించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు కూడా యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు సాయాన్ని ఇవ్వలేదని మండిపడ్డారు. ఎకరానికి 7.500 ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ 5 వేల రూపాయలు కూడా ఇవ్వలేక పోతున్నదని విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పండిస్తే పంట చేతికి వచ్చే సమయానికి సాగునీరందక రైతులు కన్నీళ్ళు పెడుతున్నారని అన్నారు. జిల్లాలో పర్యటించి పంటలను పరిశీలించామన్నారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని, నష్ట పరిహారం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని లేని ఎడల రైతుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. రైతులు ఆందోళనకు గురి కావద్దని బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మోస పూరితమైన ఆరు గ్యారెంటీలతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు గోసను పట్టించుకోని ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జడ్పీ ఛైర్మన్, పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, బాల్క సుమన్, నాయకులు చిరుముల్ల రాకేష్, గంట రాములు, బొడ్డుల లక్ష్మణ్, రఘువీర్‌సింగ్, మర్కు లక్ష్మణ్, దాసరి ఉష ఉప్పు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మానసిక వైద్యుల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 30: భారత మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర సదస్సును నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ మానసిక వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ భాగ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మానసిక సమస్యలపై పరిశోధనల ఆవశ్యకత, మానసిక సమస్యలను ఎలా పసిగట్టాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శనివారం ప్రతిమ మల్టీప్లెక్స్‌లో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ కెకె లక్ష్మన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిషన్, ప్రధానకార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎన్‌డి సంజయ్‌కుమార్, కోశాధికారి డాక్టర్ పి సాయికృష్ణ, డాక్టర్ కె పవన్, డాక్టర్ బి పురుషోత్తం, డాక్టర్ జి ప్రీతి, డాక్టర్ ఎల్ వర్షి, డాక్టర్ ఎం పృథ్వీ, డాక్టర్ ఎన్ రవికుమార్ పాల్గొన్నారు.

బావిలో దూకిన వృద్ధురాలిని కాపాడిన దివ్యాంగుడు

శంకరపట్నం, మార్చి 30: శంకరపట్నం మండలం కొత్తగట్టులో బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని దివ్యాంగుడు కాపాడాడు. గ్రామానికి చెందిన గడ్డం మల్లమ్మ అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకింది. ఆ సమీయంలో పని చేసుకుంటున్న బండారి రవీందర్ అనే దివ్యాంగుడు గమనించాడు. వెంటనే తను బావి వద్దకు చేరుకొని ధైర్యం చేసి బావిలోకి దూకి వృద్ధురాలిని నీటిపైకి తీసుకువచ్చాడు. సుమారు 20నిమిషాల పాటు మోటర్ బెల్ట్ పట్టుకొని వృద్ధురాలు నీటిలో ముని గిపోకుండా పట్టుకున్నాడు. గ్రామస్థుల సహాయంతో వృద్ధురాలిని తాళ్లతో బయటకి తీశారు. కుటుంబ సభ్యులను వివరణ కోరగా కొంతకాలంగా వృద్ధు రాలి మానసిక స్థితి బాగా లేదని తెలిపారు. 108 సిబ్బంది వృద్ధురాలిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా రవీందర్‌ను గ్రామస్థులు అభినందించారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

- 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

- విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి
- హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

- సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్

(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్ని బట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయ



కులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

- ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం
- కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం
- కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం
- ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచిపెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచిపెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురుంచి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

- చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి
- వనపర్తిలో హైడ్రామా.. బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

వైభవంగా రాజరాజేశ్వరస్వామి రథోత్సవం

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు



శ్రీస్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేములవాడ, మార్చి 20: వేములవాడ రాజరాజేశ్వరక్షేత్రంలో పార్వతీ రాజరాజేశ్వరస్వా మి వారల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామివారి దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న శివకల్యాణోత్సవంలో భాగంగా నాలుగోరోజు శనివారం సాయంత్రం ప్రధాన ఘట్టమైన స్వామివారల రథోత్సవాన్ని అశేష భక్తజనం మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథంపై దర్శనమిచ్చిన స్వామివారలను దర్శించుకున్నారు. రంగు రంగులపూలు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన రథాలపై పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంత పద్మనాభస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు రథ ప్రతిష్ఠ, రథహోమం, రథబలి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య పట్టణ వీధుల మీదుగా రథోత్సవం నిర్వహించగా, స్థానిక మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. రథోత్సవం సందర్భంగా స్థానిక యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణప్రసాద్,



మొక్కులు చెల్లించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా యోగ నారసింహుడి ఏకాంతోత్సవం

ధర్మపురి, మార్చి 30: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి వేళలో ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో వేంకటేశ్వర స్వామి వారల పుష్పయాగం కూడ నిర్వహించారు. ఈ



స్వామివారల ఏకాంతోత్సవం నిర్వహిస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాకిస్థాన్ బార్డర్‌లో ఆర్మీ జవాన్ మృతి



రామకృష్ణ(ఫైల్)

సైదాపూర్, మార్చి 30: సైదాపూర్ మండలం గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి రామకృష్ణ(27) అనే ఆర్మీ జవాన్ పాకిస్థాన్ బార్డర్‌లో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గొడిశాల గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి-స్వరూపల కుమారుడు రామకృష్ణకు మూడేళ్ల క్రితం ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం వచ్చింది. కాగా జమ్ము కశ్మీర్‌లోని ఇండియా- పాకిస్థాన్ బార్డర్‌లో జేడీ(జనరల్ డ్యూటీ)గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం రామకృష్ణ మృతి చెందినట్లుగా కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. తమ కుమారుడు మృతి చెందడంతో తల్లి తండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రామకృష్ణ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని అక్కడి అధికారులు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు చెప్పినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. రామకృష్ణ మృతికి కారణాలు తెలియ రాలేదు. మృత దేహం గ్రామానికి చేరుకుంటే పూర్తి వివరాలు తెలిసే అవకాశముందని చెబుతున్నారు. కాగా ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ మృతికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాతృ భూమి రక్షణకు సైన్యంలో చేరిన రామకృష్ణ పాకిస్థాన్ బార్డర్‌లో మృతి చెందడం బాధాకరమని తెలిపారు. రామకృష్ణ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.

బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయం రూ 30,64,396



ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహుడి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి, మార్చి 30: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు శనివారం నిర్వహించగా రూ 30,64,396 ఆదాయం లభించింది. 14 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 57 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి, 7 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో ఘనంగా రుద్రయాగం

వేములవాడ, మార్చి 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం రుద్రయాగం ఘనంగా నిర్వహించారు. శివకల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు తీర్థరాజ పూజ, శ్రీస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు, అభిషేకములు, పారాయణాలు నిర్వహించారు. అనంతరం ఏకాదశ రుద్ర కలశ స్థాపనము అనంతరం రుద్రయాగం నిర్వహించారు. తదుపరి శ్రీశివపురాణ ప్రవచనం, ఔపాసనం అనంతరం వీరశైవ జంగమ అర్చకులు బలిహరణము గావించారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణమండపంలో శృంగార వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి 30: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయలో 2024-25లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పంకజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమై ఏప్రిల్ 15న ముగిస్తుందని తెలిపారు. 1-4-2024 నాటికి 6 నుంచి 8ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. కాగా బాలవాటికా- 1,2,3లో ప్రవేశాలకు 1 నుంచి ఏప్రిల్ 15 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మార్చి 31 నాటికి 6 ఏళ్ల లోపు వారు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గంజాయి పట్టివేత

హుజూరాబాద్, మార్చి 30: హుజూరాబాద్ పట్టణంలోని డిపో క్రాస్ వద్ద ఓ బాలుడి వద్ద గంజాయిని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. పట్టణానికి చెందిన ఓ బాలుడి వద్ద గంజాయిని పట్టుకొని బంధువుల సమక్షంలో విచారించి పంచనామా చేశామన్నారు. మైనర్ బాలుడి నుంచి ఒక కిలో 72గ్రాముల గంజాయిని సీజ్ చేసి డీపీవో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ వద్ద బంధువుల సమక్షంలో హాజరు పరిచామని సీఐ రమేశ్ తెలిపారు.

రైతుల రాస్తారోకో

- వరదకాలువకు నీరు విడుదల చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యే గేట్లు ఎత్తివేయించడంతో ఆందోళన విరమణ

కథలాపూర్, మార్చి 30: వందలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని వెంటనే వరద కాలువ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దుంపెట శివారులో వరద కాలువపై రాస్తారోకో నిర్వహించారు. మేడిపల్లి, కథలాపూర్, భీమారం మండలాలకు చెందిన సుమారు వంద మంది రైతులు ప్రభుత్వం తమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ప్రస్తుతం వరి పంటలు చేతికొచ్చే దశలో ఉన్నందు వల్ల నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ప్రజాప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు రైతులను కీలక సమయంలో ఆదుకోవాలని పేర్కొన్నారు. కథలాపూర్‌లోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అక్కడికి చేరుకుని జగ్గాసాగర్ వద్ద గేట్లు తెరిపించామని నీరు వస్తుందని చెప్పారు. అయినా నీరు



రైతులను సముదాయిస్తున్న ఎస్సై

వచ్చేదాకా ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు భీష్మించుకుని కూర్చుండడంతో వేములవాడ - కోరుట్ల రహదారిపై బస్సులు, జీపులు, ద్విచక్ర వాహనాలు గంట సేపు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జగ్గాసాగర్ వద్ద నీటిని విడుదల చేసిన విషయం ఎస్సై నవీన్ రైతులకు వివరించడంతో రైతాంగం ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిడుగు ఆనం దరెడ్డి, తేలు రాజేందర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో మూలనపడ్డ అంబులెన్స్‌లు

- రెఫరల్ కోసం 108 వాహనాల వినియోగం - ఒక్క అంబులెన్స్‌తో నెట్టుకొస్తున్న వైనం - పట్టించుకోని అధికారులు - ఇబ్బందులు పడుతున్న రోగులు



గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి



ప్రభుత్వాసుపత్రిలో మూలన పడిన అంబులెన్స్



మరమ్మతుకు నోచుకోని అంబులెన్స్

కళ్యాణ్‌నగర్, మార్చి 30: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అప్‌గ్రేడ్‌గా మారినా సమస్యలు మాత్రం తొలగిపోవడం లేదు. అంబులెన్స్‌లు లేక ప్రమాదాలకు గురైన వారు మృత్యువాత పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకే అంబులెన్స్‌తో నెట్టుకొస్తున్నారు. అత్యవసర కేసులను వరంగల్, కరీంనగర్‌కు రెఫర్ చేస్తే 108వాహనాలను వినియోగిస్తున్నారు. దీంతో ఇక్కడ చుట్టు పక్కల ప్రమాదాలు జరిగితే సకాలంలో 108వాహనాలు లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతుంటే.. మరో వైపు ప్రైవేట్ అంబులెన్స్‌ల దోపిడీ మాఫియాను తలపిస్తోంది. సిండికేట్‌గా మారి ఒక కిలోమీటర్‌కు సైతం రూ.1500 జబర్దస్తీగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మొత్తం ఐదు అంబులెన్స్‌లు ఉంటే మూడు మూలన పడ్డాయి. అందులో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. ఒకటి ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులతో మంజూరు చేసినది కాగా, మరొకటి ఎంపీ నిధుల నుంచి మంజూరైనది. ఈ అంబులెన్స్ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉండాల్సి ఉండగా కరోనా సమయంలో ఇక్కడికి తీసుకువచ్చారు. ఎన్‌టీపీసీ అంబులెన్స్ ఇతర అవసరాల మందులు, గ్యాస్ సిలిండర్ల రవాణా కోసం ఉపయోగిస్తుండగా ఈ వాహనం టైర్లు కూడా చెడిపోయాయి. మధ్య మధ్యలో రిపేర్లతో నెట్టుకొస్తున్నారు. వీటిని చూడాల్సిన విభాగం పట్టించుకోకపోవడంతో ఆసుపత్రి వెనుక భాగంలో మూడు అంబులెన్స్‌లను వృథాగా పడవేశారు.

అత్యవసర కేసులకు 108 దిక్కు..

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే అత్యవసర కేసులను కరీంనగర్, వరంగల్ వంటి జనరల్ ఆసుపత్రికి పంపుతున్నారు. 108వాహనాల్లో రోగులను తరలిస్తుండడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 108వాహనాలు అందుబాటులో ఉండడం లేదు. వరంగల్‌కు వెళితే ఒక రోజంతా సమయం పడుతుంది. గోదావరిఖని, బసంత్‌నగర్ 108 వాహనాలు లేని సమయంలో కమాన్‌పూర్ లేదా మంథని నుంచి వచ్చే వరకు ఇక్కడ రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మూడు నెలల క్రితం కల్వచర్ల వద్ద ఒక రోడ్డు ప్రమాదం జరుగగా 108వాహనం సరైన సమయానికి రాకపోవడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సకాలంలో 108వాహనాలు లేకపోవడం ఇక్కడ తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోంది. మూలన పడ్డ అంబులెన్స్‌లను ఇప్పటికీ కూడా మరమ్మతులు చేయడం లేదు. అసలు అంబులెన్స్‌లో ఏయే వాహనాలు కండీషన్‌లో ఉన్నాయి, ఎక్కడికి తిరుగుతున్నాయనే సమాచారం కూడా లాగ్ బుక్‌లో నమోదు కావడం లేదు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన భార్య పేరు మీద గిఫ్ట్ ఏ స్మైల్ కింద ఇచ్చిన అంబులెన్స్‌ను కూడా మూలన పడవేశారు.

గాడి తప్పిన పాలన

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పాలన గాడి తప్పింది. ఏయే సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారో ఆర్ఎంవోలకు సమాచారం లేకుండా పోయింది. ఏ విభాగంలో ఎంత మంది పని చేస్తున్నారు. నిర్వహణ లోపాన్ని ఇప్పటికి కూడా సరిచేయడం లేదు. రోగులను అత్యవసర పరిస్థితుల్లో రెఫరల్ చేయాల్సి వచ్చినపుడు అంబులెన్స్‌లు కూడా ఇవ్వడంలేదు. ప్రైవేట్ అంబులెన్స్‌లను మాట్లాడుకోవాలని దబాయిస్తున్నారు.

ప్రైవేట్ అంబులెన్స్‌ల దోపిడీ..

ఎవరైనా రోగిని అత్యవసరంగా ఇతర ఆసుపత్రులకు తీసుకెళ్లాలన్నా ప్రైవేట్ అంబులెన్స్‌ల దోపిడీ అంత ఇంత కాదు. ఆసుపత్రి గేటు బయట పది అంబులెన్స్‌లు ఉంటున్నాయి. వారు సిండికేట్‌గా మారి రోగులను నిలువునా దోచుకుంటున్నారు. జనరల్ ఆసుపత్రిలో ఎంఆర్ఐ లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీనగర్‌కు తీసుకువస్తే రూ.1500 డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్‌కు వెళ్లాలంటే రూ.3500 నుంచి రూ.4500 వసూలు చేస్తున్నారు. ఎవరైనా రోగులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి కదలలేని పరిస్థితి ఉండి అంబులెన్స్‌లో వెళ్లాల్సివస్తే జబర్దస్తీగా రూ.1500 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇక్కడ అంతే అని దురుసుగా ప్రవరిస్తున్నారు. సేవ మాటున ప్రైవేట్ అంబులెన్స్‌ల యజమానులు దోపిడీకి పాల్పడుతున్నారని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

అంబులెన్స్‌ల సంఖ్యను పెంచాలి..

- మార్కపురి సూర్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి



మార్కపురి సూర్య

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అంబులెన్స్‌లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్లు రెఫర్ చేసినప్పుడు అంబులెన్స్ ఇవ్వాల్సి ఉండగా ప్రైవేట్ అంబులెన్స్‌ను మాట్లాడుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. రెఫర్ చేసినప్పుడు ఆసుపత్రి నుంచే వాహనాన్ని సమకూర్చి రోగిని తరలించాల్సి ఉంటుంది. కానీ ఆ సమయంలో రోగులను పట్టించుకోకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అంబులెన్స్‌ల సంఖ్య పెంచి రోగుల ప్రాణాలను కాపాడాలి.

సేవా దృక్పథాన్ని చాటిన జీసస్

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 30: సేవా దృక్పథాన్ని ప్రపంచానికి జీసస్ చాటిచెప్పాడని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం పాస్టర్స్ ఆధ్వర్యంలో మున్సిపల్ టీ జంక్షన్ నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు నిర్వహించి రన్ ఫర్ జీసస్‌లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసస్ ప్రవచనాలు చాలా పవిత్రమైనవని, సేవా నిరతిని, త్యాగాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన భగవత్ స్వరూపుడు జీసస్ అని అన్నారు. రామగుండం నియోజకవర్గంలో విద్యార్థులకు, మహిళలకు ఆకతాయిల వల్ల ఇబ్బందులు ఎదురైతే తనకు గానీ, పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని, వారి భరతం పడతామని హెచ్చరించారు. రామగుండం పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన ఏకైక ఎజెండా అని, చిరు వ్యాపారులకు ఎలాంటి కలగకుండా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, కల్యాణి సింహాచలం, కౌటం సతీష్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, బొంతల లచ్చన్నతో పాటు పాస్టర్లు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు



తుర్కలమద్దికుంటలో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు



ధూళికట్టలో పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

పెద్దపల్లి రూరల్, మార్చి 30 : దళితులను కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీవో సుదర్శన్ అన్నారు. శనివారం మండలంలోని తుర్కలమద్దికుంట దళిత కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా వారితో రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులను కులం పేరుతో దూషించిన, వారిని వేధించిన, రెండు గ్లాసుల విధానాన్ని అవలంబించిన వారిపై ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం దళితులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్య, ఆర్ఐ ఇంతియాజ్, పంచాయతీ కార్యదర్శి మసియొద్దీన్ పాల్గొన్నారు.

ఓదెల : దళితులను కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ యాకయ్య అన్నారు. మండలంలోని ఇందుర్తిలో శనివారం దళిత కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులపై ఎవరైనా దాడులకు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం దళిత పెద్దలను విచారిస్తూ రెండు గ్లాసుల పద్ధతిపై ఆరాదీశారు. అనంతరం దళితులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పొత్కపల్లి ఏఎస్ఐ లక్ష్మీరాజం, ఆర్ఐ రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



కాచాపూర్‌లో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

ఎలిగేడు : కులవివక్ష అనే అంశం రాజ్యాంగ విరుద్ధమైందని తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావులు అన్నారు. మండలంలోని ధూళికట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొని వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జాతి వివక్ష అంటరాని తనం అమానుషమని అలాంటి సంఘటనలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ అనిల్‌రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ శైలజ. అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి : గ్రామస్థులందరు కులమతాలకు అతీతంగా ఐక్యంగా కలిసిమెలసి ఉండి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నాయబ్ తహసీల్దార్ అబుబాకర్ అన్నారు. మండలంలోని కాచాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా నాయబ్‌తహసీల్దార్ అబుబాకర్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని కులాలతోపాటు ఎస్సీ కులాలకు సమాన గౌరవం కల్పించాలన్నారు. ఎస్సీలను అంటరానివారిగా చూస్తే చట్టపరంగా శిక్షింపబడుతారన్నారు. హోటళ్లలో రెండు గ్లాసుల విధానం సరికాదని, అలా వ్యవహరిస్తే ప్రజలు ఫిర్యాదుచేయాలన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కిరణ్, ఆర్ఐ స్రవంతి, పంచాయతీ శరత్, ఎంపీటీసీ మారుపాక శ్రీలత, నాయకులు కుమార్, అంతయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఓసీపీ-1 సీహెచ్‌పీని సందర్శించిన సీఎండీ



సైలో బంకర్ వద్ద ఓసీపీ-1 అధికారులతో సీఎండీ బలరాం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30: ఆర్జీ-3 ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు-1 సీహెచ్‌పీని శనివారం సింగరేణి సీఎండీ బలరాం సందర్శించారు. ఈ సందర్భంగా సైలోబంకర్‌ను ఆయన పరిశీలించారు. సైలో బంకర్ నుంచి బొగ్గు రవాణాతీరును ఆయన పరిశీలించారు. సైలోబంకర్ నుంచి జరుగుతున్న బొగ్గు రవాణా, ప్రాజెక్టుకు కేటాయించిన బొగ్గు రవాణా లక్ష్యాలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యలను సీఎండీకి ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు వివరించారు. నిర్దేశించిన బొగ్గు లక్ష్యాలను భద్రతతో సాధించాలని సూచించారు. లక్ష్యాన్ని అధిగమించిన అధికారులకు అభినందనలు తెలిపారు. వెంట ఏరియా ఇంజనీర్ ఎలీషా, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటరమణ, పీఈ శ్రీనివాస్, సీహెచ్‌పీ హెచ్‌వోడీ కాశీవిశ్వేశ్వరరావు, క్వాలిటీ అధికారి సత్యనారాయణ, మేనేజర్ ఉదయ్‌హరిజన్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియాలో అమలులో ఉన్న వేతనాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30వేల మంది కాంట్రాక్టు కార్మికుల సరైన వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఇతర పరిశ్రమల్లో మాదిరి జీవో 22ను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2022లో సమ్మెకు సిద్ధం కాగా యాజమాన్యం జరిపిన చర్చల్లో డిమాండ్లను అమలు చేస్తామని ఇప్పటివరకు అమలు చేయలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చాయని, గెలిచిన కాంగ్రెస్ పార్టీ వాటిని నెరవేర్చాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జీ రాము, రవి, దేశాయి నాయక్, రాజనర్సు, శేఖర్, వెంకటేష్, సతీష్, పద్మ, లలిత పాల్గొన్నారు.

పెద్దపల్లి ప్రజలను మోసం చేసిన వివేక్ కుటుంబం

- పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి - బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న గోమాసే శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, మార్చి 30: పెద్దపల్లి పార్లమెంటు ప్రజలను వివేక్ కుటుంబం మోసం చేసిందని బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం శివాలయంలో పూజలు చేసిన అనంతరం పెద్దపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో గోమాసే మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో బీజేపీ గెలుపు ఖాయమైందని, మూడవసారి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పెద్దపల్లిని పాలించిన గత పాలకులు అరచేతిలో వైకుంఠం చూపించి అభివృద్ధిని మరిచిపోయారని, ఇక్కడి ప్రజలను మోసం చేసి వివేక్ కుటుంబం పదవులు అనుభవించిందన్నారు. పూర్తిస్థాయిలో నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాకేంద్రం చుట్టూ రింగు రోడ్డు నిర్మాణం, మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, కేంద్రీయ విశ్వవిద్యాలయం, ముస్లింల ఖబ్రస్తానుల అభివృద్ధికి 20 లక్షల రూపాయల ఎంపీ నిధులు కేటాయిస్తానని, సీఎస్ఆర్ నిధులతో విద్యాసంస్థల ఏర్పాటు, గోదావరి నీళ్లను అదనపు పైపులైను ద్వారా పెద్దపల్లి రైతాంగానికి సాగు నీరుగా అందించడానికి కృషి చేస్తానన్నారు. తనకు అవకాశం ఇచ్చి ఎంపీగా గెలిపించాలని ఓటర్లను శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రు పట్ల సునీల్ రెడ్డి, పార్లమెంటు కన్వీనరు వెంకటేషం గౌడ్, కోకన్వీనరు గుండబోయిన లక్ష్మణ్, నాయకులు శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర రావు, పోల్సాని సంపత్‌రావు, దాడి సంతోష్, తాత రవి, గంగిపెల్లి స్వామి, రాజం మహంత, చిలారపు సంపత్, మేకల శ్రీనివాస్, గుడ్ల సతీష్, వివిధ మండలాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకున్న ఆర్కే న్యూటెక్ గని



ఉద్యోగులను అభినందిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, మార్చి 30: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గని శుక్రవారం రాత్రి షిఫ్ట్‌తో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంది. శనివారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం బి సంజీవరెడ్డి గని ఉద్యోగులను అభినందించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. రెండేళ్లుగా న్యూటెక్ గని వందశాతం ఉత్పత్తి సాధించడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ఇది అందరి కృషితో జరిగిందని, అందరూ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రాముడు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేష్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'నోట్ల కట్టలతో వచ్చే నాయకులను నమ్మకండి'

కళ్యాణ్‌నగర్, మార్చి 30: ఎన్నికల్లో నోట్ల కట్టలతో వచ్చే నాయకులను నమ్మవద్దని న్యూ ఇండియా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వేముల అశోక్ అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నుంచి నీరటి శంకర్ బరిలో ఉంటున్నారని, ప్రజలు ఈ సారి శంకర్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. కల్లబొల్లి మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజలు తిరస్కరించిన వారికి ప్రధాన రాజకీయ పార్టీలు మళ్లీ టికెట్లు ఇస్తున్నాయని విమర్శించారు. ప్రజలు తమ ఓటును నిర్భయంగా ఉపయోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగవద్దన్నారు. అభ్యర్థి నీరటి శంకర్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రపంచం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుంటే మనం మాత్రం రేషన్‌కార్డుల కోసం చూస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల అభివృద్ధి జరుగాలంటే ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని నీరటి శంకర్ కోరారు.

'స్థానిక అభ్యర్థికే కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి'

పెదపల్లిటౌన్, మార్చి 30: పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని స్థానికుడైన పెర్క శ్యాంకు కాంగ్రెస్ తరఫున టికెట్ ఇవ్వాలని తెలంగాణ మాదిగ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సుంచు మల్లేశం, జిల్లా కోకన్వీనర్ పెర్క బానేష్ కాంగ్రెస్ అధినాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన శ్యాంను ఎంపీ బరిలో నిలిపితే పెద్దపల్లిలో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. పెద్దపల్లి అభ్యర్థిగా ప్రకటించిన గడ్డం వంశీ అభ్యర్థిత్వాన్ని నిలిపివేసి మాదిగ సామాజిక వర్గానికి చెందిన శ్యాంకు పోటీ చేసే అవకాశం కలిcంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శ్యాంను అభ్యర్థిగా ప్రకటిస్తే మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేసి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కో కన్వీనర్ బొల్లి నందయ్య, నియోజకవర్గ ఇంచార్జి చొప్పదండి మల్లేశం, ఆలిండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు కాంపెల్లి జీవన్, ఇరుగురాల రాజ నర్సయ్య, కాంపెల్లి తిరుపతి, పుల్లకోళ్ల లింగమూర్తి, దూడ శ్రీధర్, కల్లెపెల్లి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అందరూ పోషకాహారం తీసుకోవాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 30 : ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుంటూ శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, మానసిక వైద్యులు డా.మధుకర్‌రెడ్డి అన్నారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. శనివారం పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న మానసిక వైద్యులు డా.మధుకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్.పి అభినయ్, హెచ్‌ఈ మధుసూదన్, యుడిసి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్‌కు సన్మానం

కోల్‌సిటీటౌన్, మార్చి 30: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన ఖాజా జహీర్ అహ్మద్‌ను అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శనివారం కళాశాల ఆవరణలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజాజహీర్ అహ్మద్‌ను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు శాలువలు, పూల మాలలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఖాజాజహీర్‌అహ్మద్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రాజేష్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్, అధ్యాపకులు సుబ్బారావు, అజయ్, డాక్టర్ కిరణ్మయి, ఆంజనేయులు, సంగీత, ఉష, శారదా, రమాదేవి, శ్రీదేవి, సౌజన్య, గెస్ట్‌ఫ్యాకల్టీ గడ్డం శ్యాంకుమార్, కాంపెల్లి సతీష్, జెట్టి రాము, సుద్దాల శ్రీనివాస్, సందీప్, కిరణ్, సాగర్, రామకృష్ణ, శివ, రాజు, సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ మాతంగి శ్రీధర్, కోటి, సాయిరాం, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలి



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

కోల్‌సిటీటౌన్, మార్చి 30: మహనీయుల జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం గోదావరిఖనిలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 5న బాబుజగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిరావు పూలే, 14న అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమాలకు సహకరించాలన్నారు. ప్రభుత్వ పరంగా కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంకూరి మధు, పులి మోహన్, మంతెన లింగయ్య, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, నాయకులు బొమ్మక రాజేష్, ఇరుగురాల కృష్ణయ్య, దుబాసి బొందయ్య, బూడిద మహేందర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

కమాన్‌పూర్, మార్చి 30 : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తే సమాజంలో సరైన గుర్తింపు ఉంటుందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

కమాన్‌పూర్, మార్చి 30: మండలంలోని భూదేవి, శ్రీదేవి సహిత బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు పోచమ్మ కొలుపు ఉత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలతో గ్రామంలో పురవీధుల గుండా ప్రత్యేక వాహనంలో ర్యాలీ నిర్వహించారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమాలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ విగ్రహాల ప్రతిష్ఠాపన, పోచమ్మ కొలువు కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం

కమాన్‌పూర్, మార్చి 30 : మండల కేంద్రంలోని పిల్లిపల్లె గ్రామంలో రేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకలు శనివారంతో మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గౌడ కులస్థులు గ్రామంలో జోగు తిరుగుడు కార్యక్రమం నిర్వహించారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

రామగిరి, మార్చి 30: హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కులో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పురస్కరించుకొని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చీమశ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్జీ-3 డివిజన్ పలువురి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉద్యమకారులకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఉద్యమంలో పనిచేసిన వారికి 250 గజాల గృహస్థలాలు, ఉద్యమకారులుగా గుర్తింపుకార్డులు, బస్, ట్రైన్ పాస్‌ల డిమాండ్‌లను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పెద్దపల్లిలో దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఉద్యమకారుల డిమాండ్లపై మేనిఫెస్టోలో చేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్, నూనేరాజేశం, కళాధర్‌రెడ్డి, బత్తుల శంకర్, ప్రతాప్‌రెడ్డి, నాగుల కృష్ణ రాజేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, సదాశివ్, తదితరులు పాల్గొన్నారు.